క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: జేగురుపాడులోని ట్రినిటీ లూథరన్ చర్చిలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజేశ్వరి లయన్స్ నేత్ర వైద్యశాలకు చెందిన సిబ్బంది ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ శిబిరాన్ని ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాల వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. చర్చి ఫాస్టర్ డి.సునీల్ కుమార్, సీఆర్ బట్టు దేవానందం, ట్రెజరర్ యాదల మహేంద్ర, స్థానిక పెద్దలు తొర్లపాటి సువర్ణరత్నం, ఎం.రాంబాబు, గుంటూరి నరేష్ సేవలందించారు.

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



పారోజు ముత్యాలుకు ఆర్థిక సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పారోజు ముత్యాలు ఎడమ చేతి నరాల సమస్యతో ఆసుపత్రిలో చేరారు. దాని శస్త్రచికిత్సకు రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మాజీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పారోజు ముత్యాలను కలిసి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్వీ శేఖర్ రూ.10 వేలు అందించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానని చందన నాగేశ్వర్ తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

కడియం: సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కడియం, కడియపులంక పీహెచ్‌సీల పరిధిలో రోజుకొక గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం కడియం మండలం వేమగిరి–3 పరిధిలోని జక్కంపూడి నగర్, కడియపులంక–2 పరిధిలో రామాలయం వద్ద శిబిరాలు జరిగాయి. వేమగిరిలో 33 మందిని పరీక్షించగా వారిలో ముగ్గురు జ్వరంలో బాధపడుతున్నట్లు గుర్తించారు. కడియపులంకలో 45 మందిని పరీక్షించి జ్వరంతో ఉన్న నలుగురికి మలేరియా, ఇద్దరికి డెంగీ పరీక్షలు చేశారు. ప్రభుత్వ వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, జి.స్వరూప, వైద్య సిబ్బంది సేవలందించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



నగరంలో విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: విజయవాడలోని వరద బాధితుల కోసం ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల సంయుక్తంగా ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాలలోని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తమ వంతు ధన, వస్త్ర సహాయం చేశారు. అలాగే దేవీచౌక్ నుంచి మెయిన్ రోడ్డు వరకూ నగరవాసులు, వర్తకులు, దాతల నుంచి కూడా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జున్, భవాని, యూసఫ్ బాషా, రవితేజ, జాకబ్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కల్వర్టును పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 43వ డివిజన్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను వివరించారు. కంటిపూడి స్టీల్స్ దుకాణం ప్రాంతంలో మూడు కల్వర్టులు, రెండు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. అలాగే డివిజన్‌లోని సాయిబాబా ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఉగ్ర గోదావరి



పుష్కరాల రేవులో మంగళవారం రాత్రి 7 గంటలకు 53 అడుగుల నీటిమట్టం



మునిగిపోయిన గోదావరి నిత్య హారతి ప్రదేశం

రాజమహేంద్రవరం సిటీ: వరద నీటితో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న నీటితో ఉప్పొంగుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఆ నీరు రాజమహేంద్రవరం మీదుగా ధవళేశ్వరం చేరుతోంది. గోదావరికి వరద పెరగడంతో పుష్కర ఘాట్ వద్ద నీటి ఉధృతి పెరిగింది. మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి నీటిమట్టం 53 అడుగులకు చేరింది. నిత్యహారతి ప్రదేశం మునిగిపోయింది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో మాధవరావు

కడియం: ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పురుగు మందులు, ఎరువుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఏవో మాట్లాడుతూ ఎమ్మార్పీకి మంచి విక్రయాలు జరపకూడదన్నారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రైతులకు తెలిసే విధంగా నమోదు చేయాలన్నారు. నిబంధనల మేరకు వ్యవహరించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏడీ శ్రీనివాసరెడ్డి, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని పాల్గొన్నారు.

కుట్టు, మగ్గం వర్క్‌లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కోర్సులలో ప్రవేశానికి పదో తరగతి చదివిన వారికి అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 23 వరకూ అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 నంబర్లను సంప్రదించాలన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్యామల సెంటర్‌లో సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు రాస్తారోకో నిర్వహించారు. తొలుత మానవ హారంగా ఏర్పడ్డారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందంటూ టూటౌన్ పోలీసులు బలవంతంగా కార్మిక సంఘాల నేతలను పక్కకు తొలగించే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న తమపై పోలీసులు దురుసుగు ప్రవర్తించడం సరికాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ప్రజా సంఘాల నాయకులు తులసి, ఎస్.రాజా, పవన్, ఎం.సుందర్ బాబు, మూర్తి పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో చేతివృత్తులకు ఆసరా



కిట్లను పరిశీలిస్తున్న రొంగల గోపీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ఒక ఆసరాగా నిలుస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ అన్నారు. సీతంపేటలోని శ్రీ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో శిక్షణ పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతివృత్తిదారులు, కులవృత్తిదారులకు ఈ పథకం ద్వారా రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్, ఆర్టిసన్ కార్డు, శిక్షణ సర్టిఫికెట్, శిక్షణ సమయంలో స్టైఫండ్, దారి ఖర్చులు అందజేస్తున్నారన్నారు. తదనంతరం వ్యాపారం కోసం రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల రుణాన్ని కేవలం 40 పైసల వడ్డీతో మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కాలెపు సాయిరాం, ముగండి సూర్యనారాయణ మాస్టర్, రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆవస్థలు తప్పవా!



హుకుంపేట వద్ద ఆవ కాలువలో జేసీబీతో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది



ఆవ కాలువలో కలుపు మందు కొడుతున్న పంచాయతీ కార్మికుడు

- పూడికతీత పనులతో అదనపు భారం
- కార్పొరేషన్ చేపట్టదన్న కమిషనర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఏడాదీ వర్షాకాలం ముందు ఆవ కాలువలో పూడికతీత పనులను నగరపాలకసంస్థ చేపట్టేది. ఇప్పుడు ఆ బాధ్యత ఆవకాలువ పరిధిలోని పంచాయతీపై మోపింది. ఈ మేరకు నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీనివల్ల సదరు గ్రామ పంచాయతీలపై అదనంగా భారం పడనుంది. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు, వర్షం నీరు హుకుంపేటలోని ఎస్‌టీ ప్లాంట్‌కు చేరుతుంది. అక్కడ మురుగునీటిని శుద్ధి చేసి హుకుంపేట, బొమ్మూరు ఆవకాలువ ద్వారా ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. ఇప్పటి వరకూ ప్రతి ఏడాదీ వర్షాకాలం ముందు నగరపాలకసంస్థ అధికారులు జేసీబీలతో హుకుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల మీదుగా వెళ్లుతున్న ఆవ కాలువలోని గుర్రపుడెక్క, పూడికను తీయించేవారు. గోదావరి ఉధృతంగా ఉన్న సమయంలో ఆవకాలువ నుంచి గోదావరిలో కలిసే నీరు వెనక్కి ప్రవహిస్తే.. ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద భారీ మోటార్లు ఏర్పాటు చేసి ఆ నీటిని గోదావరిలో తోడించే ఏర్పాట్లు చేశారు. అయితే కమిషనర్ మౌఖిక ఆదేశాలలో ఆ పరిస్థితి మారనుంది.

పంచాయతీలదే బాధ్యత

ఆవ కాలువ పూడికతీత పనులను నగరపాలక సంస్థ చేపట్టదని, ఆ పనులను గ్రామ పంచాయతీలే చేపట్టాలని ఇటీవల కమిషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల గోదావరి ఉధృతంగా ఉన్న సమయంలో ఆవకాలువ పరిశీలనకు వచ్చిన కలెక్టర్ పి.ప్రశాంతికి మండలస్థాయి అధికారులు ఆవకాలువ పూడికతీత పనులు పంచాయతీలు చేపడితే అదనపు భారం పడుతుందని వివరించారు. దీంతో కలెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధుల నుంచి విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.

అదనపు భారం

హుకుంపేట పంచాయతీ పరిధిలోని ఆవ కాలువలో పూడికతీత పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. గుర్రపుడెక్కను జేసీబీల సహాయంతో తొలగించాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముందుగా గుర్రపుడెక్కను కలుపుమందు కొట్టి అవి ఎండిపోయిన తరువాత అనంతరం జేసీబీ సహాయంతో తొలగించాలి. ఆవ కాలువపై ఆక్రమణలను తొలగించినప్పటికీ ప్రతి ఏడాది గుర్రపుడెక్క వస్తూనే ఉంటుంది. దీన్ని తొలగించాలంటే అదనపు భారం పడుతుందని అధికారులు వాపోతున్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని మురుగు నీరు, వర్షం నీరే ఆవ కాలువలో అధికంగా ప్రవహిస్తుందని, కాబట్టి నగరపాలక సంస్థ పూడికతీత పనులు చేపట్టాలని మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

200 ఎకరాలలో వరి పంటకు పాక్షిక ముంపు



ముంపు ప్రాంతంలో వరి పంటలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

రాజానగరం: ఇటీవల కురిసిన వర్షాలకు కోరుకొండ మండలంలో సుమారు 200 ఎకరాల వరి పంట పాక్షికంగా ముంపు బారిన పడిందని దివాన్ చెరువు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు మంగళవారం ఆయా ప్రాంతాలను పర్యటించి, రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాలకు సూరంపాలెం కాలువ పోటెత్తడంతో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవపురం, నాగంపల్లి, సూరంపాలెం, మునగాల, కోటికేశవరంలోని ఈ పరిస్థితి ఏర్పడింది. వాటిలో సుమారు 60 ఎకరాలు పూర్తిగా మునిగిపోయాయి, అక్కడక్కడా నేల కోతకు గురైంది. అయితే వర్షాలు తగ్గడంతో ముంపు నీరు నెమ్మదిగా తీసేస్తుంది కాబట్టి రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయాధికారులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు

ముంపు బారిన పడిన పొలాలలో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలలో అక్కడక్కడా మాగుడు తెగులు సోకినట్టుగా గుర్తించామని, దీని నివారణకు హెక్సాకోనాజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రొపికోనాజోల్ ఒక మిల్లీలీటర్ లేదా 0.4 గ్రాముల ట్రిప్లాక్సీస్ట్రోబిన్, టెబ్యూకానోజోల్ లేదా అజాక్సీస్ట్రోబిన్ 1.5 మిల్లీలీటర్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపు నీరు నుంచి తేరుకున్న పొలాలలో ఎకరాకు 20 కిలోల పొటాష్‌తో పాటు 20 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. ఎండ తీవ్రత పెరిగే కొద్దీ ఆకుముడత తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జున రావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, వ్యవసాయాధికారి గౌరీదేవి, ఆత్మ ప్రాజెక్టు ఏటీఎం జె.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూడైస్ డేటాను సమగ్రంగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: ప్రతి పాఠశాల ఆవాస ప్రాంతంలో బడి బయట పిల్లలు ఉండరాదని, యూడైస్ డేటాను సమగ్రంగా పూర్తి చేయాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఆర్ఎంటీలు, వార్డ్ ఎడ్యుకేషన్, డేటా ప్రోసెసింగ్ సెక్రటరీ, వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలకు అత్యవసర సమావేశం నిర్వహించారు. దిలీప్ కుమార్ మాట్లాడుతూ యూడైస్ 2024 – 25లో పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలు సమగ్రంగా పొందుపర్చాలన్నారు. సీఆర్ఎంటీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలన్నింటిలోనూ యూడైస్ డేటా సమగ్రంగా పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ ఎంఈఓ – 2 రమా రజని, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ పద్మావతి పాల్గొన్నారు.

నిరంతరం పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు వివిధ విషయాలపై నిరంతరం పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. స్థానిక ఓఎన్‌జీసీ బేస్‌కాంప్లెక్స్‌లో కేంద్రియ విద్యాలయంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రకాష్ బాబు మాట్లాడుతూ పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మోసపూరితంగా వారిని అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని తెలిపారు. పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. సమావేశంలో కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ వర్షాజైన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి కష్టాలు తీర్చాలని వినతి



ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

కడియం: నర్సరీ రంగంలో మొక్కలను పెంచేందుకు మట్టి అత్యంత కీలకమైనది. అయితే ఇటీవల మైనింగ్ బిల్లుల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో మట్టి ధరలు అధికమై ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు కలిసి నర్సరీ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కొవ్వూరు టోల్‌ప్లాజా దగ్గర మట్టి తరలించే వాహనాలను కాటా పైకి ఎక్కించి మైనింగ్ బిల్లులు నిర్ధారిస్తున్నారన్నారు. దీనివల్ల మట్టి ధరలు పెరిగిపోతున్నాయని, మొక్కలు సాగు చేసే రైతులకు పెట్టుబడి భారం అవుతోందని వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

17న అనంత పద్మనాభస్వామి వ్రతం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో ఈ నెల 17వ తేదీన 108 జంటలతో అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి చిన్న వెంకన్న బాబు స్వామీజీ తెలిపారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ అరణ్యవాసం చేస్తున్న పాండవులకు శ్రీకృష్ణుడు ఈ వ్రతాన్ని ఉపదేశించాడన్నారు. ఈ వ్రతం ఆచరించి రక్ష ధరిస్తే అద్భుత ఫలితాలు కలుగుతాయని తెలిపారు. పీఠం జాతీయ సహాయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ ఆసక్తి కలవారు 86888 88999 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూచిమంచి అనంత పద్మనాభశర్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యుత్ అధికారుల విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న నక్కపల్లి శామ్యూల్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్లు ఒకరోజు వేతనం రూ.3.47 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కపల్లి శామ్యూల్ మంగళవారం రాజమహేంద్రవరంలో తెలిపారు. విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడుకు ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్‌కు చెందిన చెక్కు అందజేశామన్నారు. ఆయన వెంట అసోసియేషన్లకు చెందిన సెక్రటరీ జనరల్ నాగప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట రామారావు, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ దత్, సెక్రటరీ జనరల్ ప్రతాప్, అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇంధన శాఖ కార్యదర్శి విజయానంద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ చేకూరి కీర్తి కూడా హాజరయ్యారు.

జీవో 85 రద్దు చేయాల్సిందే

జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు మౌనిక



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నల్ల బ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మౌనిక

రాజమహేంద్రవరం రూరల్: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకువచ్చిన జీవో 85కు వ్యతిరేకంగా రాష్ట్ర పీహెచ్‌సీ వైద్యుల సంఘం పిలుపు మేరకు మంగళవారం జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) వైద్యులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు డా.మౌనిక మాట్లాడుతూ జీవో 85 ద్వారా పీహెచ్‌సీ వైద్యుల మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా చేస్తూ మా ఉన్నత చదువుల కలలకు గండికొట్టే ప్రయత్నం చేస్తూ ఇలా అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమన్నారు. ఈనెల 12వ తేదీ వరకు వైద్యసేవలో అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే 13వ తేదీన అత్యవసర సేవలు మినహాయించి అన్ని రిపోర్టింగ్, వీసీ, టీసీ, అధికారక మ్యూనికేషన్లు నిలిపివేస్తారన్నారు. 14వ తేదీన పీహెచ్‌సీలలో అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమవుతామన్నారు. 15వ తేదీన వైద్య శాఖ కార్యాలయానికి చలో విజయవాడ ర్యాలీ చేపడతామని, 16వ తేదీన జీవో రద్దు కోరుతూ నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే ధ్యేయంగా జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	35 చిన్నకథకాదు
సూర్యప్యాలెస్	సరిపోదా శనివారం
స్వామి	సరిపోదా శనివారం
అశోక	ఆయ్
శివజ్యోతి	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
అనుశ్రీ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
రాజా	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
రంభ	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం, ఉరుకు పటేలా.
ఊర్వశి	కమిటీ కుర్రోళ్లు
మేనక	తంగలాన్
కుమారి	సరిపోదా శనివారం
అప్సర	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
ధవళేశ్వరం	
వీఎస్ మహల్	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)
కడియం	
వెంకటసూర్య	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (గోట్)